క్లుప్తంగా

పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయండి

తాడికొండ: మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తిచేయాలని ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం తాడికొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో భాగంగా పలు విభాగాల అధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఆమె మండల పరిధిలో జరుగుతున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, పలు అభివృద్ధి పనుల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన పనులు పూర్తిచేయాలన్నారు. మండలంలో గృహ నిర్మాణం కొనసాగుతున్న తీరు పేదల ఇళ్ల నిర్మాణంలో ఏమైనా అడ్డంకులు ఉంటే వెంటనే ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని సూచించారు. ఎంపీడీఓ అత్తోట దీప్తి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ప్రజల అవసరాలను గుర్తించి వారికి సేవలందించాలని సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా మండలంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ సాధారణ సమావేశం ఎంపీడీఓ వీరయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌ల దగ్గర నుంచి వివరాలు సేకరించి ఆయా శాఖల అధికారులతో సమావేశంలో చర్చించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి పనులు జరిగాయని, గత సమావేశంలో సభా దృష్టికి వచ్చిన సమస్యలను 90 శాతం పరిష్కరించామని, దుగ్గిరాల మండల పరిధిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం, జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అలాగే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రతి ఒక్క సచివాలయ పరిధిలో ఆటలను నిర్వహించిందని, ఈ పోటీలలో గెలుపొందిన వారికి మండలస్థాయిలో ఈనెల 10వ తేదీ నుంచి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులతో చర్చించి తక్షణమే వాటిని పరిష్కరించాలని తీర్మానం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, తహసీల్దార్ మల్లేశ్వరి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, పశు వైద్య సహాయ సంచాలకులు ఆర్. అపర్ణ, ఏపీఎం మహాలక్ష్మి, ఏఈలు రమేష్‌రెడ్డి, వనిత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెడికల్ ఉద్యోగి మృతి

తాడికొండ: తాడికొండ మండలంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కొల్లు జాన్ బాబు (54) ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. సీనియర్ ఉద్యోగిగా మండలంలో అందరి మన్ననలు పొందిన జాన్‌బాబు మరణం పట్ల మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ దిగ్భ్రాంతి తెలియజేశారు. శనివారం స్వగ్రామమైన తాడికొండ శివారు బడేపురంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొని భౌతిక కాయానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జన్ భాగిరథిలో పాల్గొనండి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో నేటి నుంచి 11వ తేదీవరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగే జన్ భాగిరథి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దుగ్గిరాల ఎంపీడీఓ వీరయ్య శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, ఆ విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని, దానిని పురస్కరించుకుని ప్రతి సచివాలయ పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాలర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.



సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి
- చిర్రావూరులో పెంచిన పెన్షన్లు అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ప్రాతూరు సచివాలయాన్ని వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంతమందికి పెన్షన్‌ను ఇస్తున్నారు? ఇంకా ఎవరైనా పెన్షన్‌కు అర్హులై ఉన్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. అనంతరం కొత్తగా నమోదైన లబ్ధిదారులకు పెన్షన్‌ను అందజేశారు. అనంతరం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరులో నిర్వహిస్తున్న వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఏ విధంగా అందజేస్తున్నారు? ఇంకా ఎవరైనా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందడం లేదా? అందకపోతే ఎందుకు అందడం లేదు? కారణాలు ఏమిటి అని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ ఇంత పెద్దస్థాయిలో సంక్షేమ పథకాలు నేరుగా ఇంటివద్దనే పొందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను అమలుచేయడంతో పాటు విద్య, వైద్యంపై దృష్టి సారించారని, అందులో భాగంగానే నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ నూతన భవన నిర్మాణాలు చేపట్టారని, మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని, డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి, పేదవారికి వైద్యం అందిస్తున్నారని, జగనన్న ఆరోగ్య సురక్ష–2లో భాగంగా నిపుణులైన వైద్యులు ఇంటివద్దకే వచ్చి వైద్యం చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమాల్లో తాడేపల్లి వైఎస్సార్‌సీపీ రూరల్ మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, ఇప్పటం సొసైటీ అధ్యక్షుడు మేకల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అమరా నాగయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పలుకూరి మేరిరాణి, ఎస్సీ సెల్‌జిల్లా సెక్రటరీ సంకురు మరియబాబు, నాగిరెడ్డి, గడ్డం తాతయ్య, దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్ మేకల నాగేశ్వరరావు, తాడేపల్లి మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, పార్టీ కుంచనపల్లి అధ్యక్షుడు మిరియాల రాంబాబు, కొలనుకొండ అధ్యక్షుడు నూతక్కి శ్రీనివాసరావు, బాజీ గంగధరరావు, సచివాలయ అడ్మిన్లు, సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



చిర్రావూరులో పెన్షన్లు అందజేస్తున్న ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి


మేడికొండూరులో పెన్షన్ అందజేస్తున్న జెడ్పీటీసీ కందుల సిద్ధయ్య, ఎంపీపీ స్వప్నరాజేష్

మాటతప్పని నేత సీఎం వైఎస్ జగన్

మేడికొండూరు: గతఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాటతప్పని నేతగా నిలిచారని జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్ అన్నారు. శనివారం మేడికొండూరు మండల కేంద్ర కార్యాలయం వద్ద జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3వేలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీన ఇంటి వద్దకు వలంటీర్లను పంపించి పింఛను అందజేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా పింఛన్ అందించలేదన్నారు. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధి గల సీఎం వై.ఎస్.జగన్‌కు ఎల్లప్పుడూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖరరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొరివి చెన్నయ్య, కో–ఆప్షన్ మెంబర్ చంటి బాజి, బి.వి.సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్‌లు పాములపాటి జయరావు, షేక్ గాలిబ్, ముత్యాల బాలస్వామి, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాస శర్మ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

తాడికొండ: ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనిక పాలనకు నిదర్శనమని మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. శనివారం తాడికొండ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వృద్ధులకు ప్రభుత్వం పెంచి అందిస్తున్న పింఛన్ పంపిణీ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడైనా అర్హత ఉండి పింఛన్, సంక్షేమ పథకాలు అందలేదని చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా దేశానికే ఆదర్శంగా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఏపీని అడుగులు వేయిస్తున్న సీఎం జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి నేడు ఎన్నికలో ఓట్లు అడుగుతున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం హామీలు నెరవేర్చిన దాఖలా ఉందా అని ప్రశ్నించారు. ప్రధానంగా చంద్రబాబు అబద్ధపు హామీలు ఇవ్వడంలో సిద్ధహస్తుడని 2014 ఎన్నికల్లో గెలిచేందుకు 600 హామీలు ఇచ్చి ఒక్క హామీని కూడా నెరవేర్చని చంద్రబాబు ఇప్పుడు మళ్లీ హామీలిస్తూ రాష్ట్రంలో తిరుగుతుండటం సిగ్గుచేటన్నారు. అమ్మకు అన్నం పెట్టని వాడు పిన్నమ్మకు బంగారు గాజులు కొనిపిస్తానన్న చందంగా 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోని బాబు ఇప్పుడు హడావుడి చేస్తుండటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్నివిధాలా న్యాయం జరిగింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే అని మళ్ళీ ఏపీలో వచ్చేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. రాష్ట్రంలో గోబెల్స్ ప్రచారంతో తానే అధికారంలోకి వస్తానని చెప్పుకుంటున్న బాబు, లోకేష్‌లు రాబోయే ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా డిపాజిట్లు కూడా దక్కవన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆయన రూ.3 వేల పింఛన్‌ను అందజేశారు. మార్కెట్ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, సర్పంచ్ తోకల సరోజిని, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ అత్తోట దీప్తి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పింఛన్ అందజేస్తున్న మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ మేకతోటి దయాసాగర్

యువత ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి

ఏపీ రాష్ట్ర ప్రత్యేక కార్యదర్శి బి. సుందర్

తాడేపల్లిరూరల్: యువత ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లడం ఒకప్పటి మాట అని, ఇప్పుడు మన దేశంలో పెరిగిన స్టార్టప్‌ల ద్వారా మన దేశంలో ఉన్న యువత పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేరుకుంటారని ఏపీ రాష్ట్ర ప్రత్యేక క్యాదర్శి బి.సుందర్ అన్నారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన ఇన్నోవేటివ్ భారత్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ విజయవాడ ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. సుందర్ మాట్లాడుతూ నాలుగేళ్లతో పోలిస్తే భారత్‌లో స్టార్టప్‌ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. 2019లో నాలుగు వందల స్టార్టప్‌లు ఉండగా 2023 నాటికి లక్షా 20 వేలకు చేరుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. భారత్‌లో ఉన్న యువశక్తి మరే ఇతర దేశాల్లో లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ నూతనంగా పరిశ్రమలను, స్టార్టప్‌లను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. కేంద్ర నూతన ఆవిష్కరణ విద్యావిభాగ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దీపన్ సాహు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన వికసిత్ భారత్, భారత్ సంకల్పయాత్ర వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందడంతోపాటు రానున్న కాలంలో ప్రపంచాన్ని ఎదుర్కొనే ఆర్థిక శక్తి భారత్ యువతలో దాగి ఉందన్నారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నూతన ఆవిష్కరణ స్టాళ్లను ఎఐసీటీ అసిస్టెంట్ డైరెక్టర్ కె.సుబ్బారావు, ఎఐసీటీ సలహాదారు డాక్టర్ రాఘవ్ దాస్‌లతో కలసి పరిశీలించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఐఐసీ విజయవాడ ప్రాంతీయ సదస్సుకు దేశ వ్యాప్తంగా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ కోనేరు రాజాహరీన్, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డిజైన్ థింకింగ్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహరాజు, కేఎల్‌టీఎఫ్ సీఈఓ అలోక్ గోవిల్ తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న బి. సుందర్

ఏపీఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం ఏపీఎన్‌జీఓ సత్తెనపల్లి డివిజన్ ఆధ్వర్యంలో క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. క్యాలెండర్లను వైద్యురాలు ఫరీనాబేగం ఆవిష్కరించి సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా సంఘ అధ్యక్షుడు పి.మణిరావు మాట్లాడుతూ మండల కేంద్రంలో ఎంపీడీఓ విలియమ్స్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పద్మనాభుడు, రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రార్ నాగేశ్వరరావులు క్యాలెండర్లు ఆవిష్కరించి పంపిణీ చేశారన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు కొండపల్లి సుదర్శనరాజు, కార్యదర్శి అంబేడ్కర్, ఇబ్రహీం, శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు నాణ్యమైన విద్య ప్రభుత్వ లక్ష్యం

- బాపట్ల ఎంపీ నందిగం సురేష్, మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్
- తాళ్ళాయపాలెం ఎంపీపీ హైస్కూల్‌లో అరసవెల్లి అరవింద్ ట్రస్టు సహకారంతో రూ.48 లక్షలతో నిర్మించిన నూతన భవనం ప్రారంభం

తాళ్ళాయపాలెం(తాడికొండ): ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని బాపట్ల ఎంపీ నందిగం సురేష్, మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. శనివారం తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం గ్రామంలో అరసవిల్లి అరవింద్ చారిట్రబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.48 లక్షలతో నిర్మించిన ఎంపీపీ పాఠశాల భవనాల ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. తొలుత ట్రస్టు సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, శిలాఫలకం ఆవిష్కరించి, భవనాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో అన్ని వర్గాలకు సమాన ఎదుగుదల సాధ్యమని గ్రహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ దిశగా అడుగులు వేస్తూ ప్రతి పేదవాడికి నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో నాడు – నేడు, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందరికీ చేరువచేశారన్నారు. గత 75 సంవత్సరాలు భారత దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమం పేదల తలుపుతట్టి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ హక్కుగా అందుతుందంటే అది జగనన్న చలవే అన్నారు. ఏపీలో అమలవుతున్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమైందని పలు నివేదికలు స్పష్టం చేశాయని, రాబోయే 15 సంవత్సరాల్లో మన రాష్ట్రం నుంచి ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎందరో ఉన్నత కొలువుల్లో స్థిరపడటం ఖాయమన్నారు. ఎంపీ నందిగం సురేష్ సతీమణి, బేబీ, అరసవిల్లి అరవింద్ ట్రస్టు సభ్యులు యార్లగడ్డ సాహితీ, రాసంశెట్టి సౌజన్య, గొల్ల శేఖర్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, మందడం, తుళ్ళూరు సొసైటీ అధ్యక్షులు ఆలూరి శ్రీనివాసరావు, నాయుడు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల శేషగిరిరావు, బత్తుల కిషోర్, గడ్డం జయరావు, శృంగారపాటి సందీప్, ఆలోకం సురేష్, చనుమోలు రామారావు, ఆరేపల్లి జోజి, పుట్టి సుబ్బారావు, ఐనవోలు సుధీర్, మేడిద శ్రీహరి, ఎంపీడీవో శివన్నారాయణ, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


భవనం ప్రారంభిస్తున్న ఎంపీ నందిగం సురేష్, మేకతోటి దయాసాగర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

40 సవర్ల బంగారం, రూ.2 లక్షల నగదు అపహరణ

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నవోదయ కాలనీలో తాళాలు వేసిన ఇంట్లో భారీ చోరీ జరిగిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి నవోదయ కాలనీలో నివాసముండే గొర్ల వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూడగా తలుపు తాళాలు తీసి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించగా బెడ్‌రూమ్‌లో వున్న కప్‌బోర్డులు పగలకొట్టి కనిపించాయి. కప్‌బోర్డ్ డెస్క్‌లో 40 సవరల బంగారం, రూ.2లక్షల నగదు మాయమైనట్లు గుర్తించి గొర్ల వేణుగోపాల్‌రెడ్డి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు వేలిముద్రలు సేకరించి జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.



